RNI No: TGTEL/25/A2649
VOICE OF PRAJALU
# వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



**తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు శుభవార్త**

::: 2 కొత్త రైళ్లు ప్రకటించిన రైల్వే శాఖ

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, ఏప్రిల్ 17, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 14 | పేజీలు: 8 | వెల : రూ.1

# పునర్విభజనతో నష్టం ఉండదు: ప్రధాని మోదీ



భారత ప్రజాస్వామ్యంలో ఇది చారిత్రాత్మక క్షణం... మహిళలకు 33% ప్రాతినిధ్యం ఇవ్వడం దేశ భవిష్యత్తుకు కీలకం. దేశ జనాభాలో సగం మహిళలే... నిర్ణయాల్లో వారికి సమాన భాగస్వామ్యం ఉండాలి. ఈ బిల్లుకు క్రెడిట్ ఎవరికైనా ఇవ్వండి... కానీ దేశ ప్రయోజనాల కోసం అందరూ కలిసివచ్చాలి. ప్రక్రియలో ఎలాంటి అన్యాయం జరగదు... అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం చేస్తాం. ప్రజల నిజమైన ప్రాతినిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల పాత్ర పెరగాలి... దేశ అభివృద్ధికి కొత్త దిశ వస్తుంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సంస్కరణను ఇక ఆలస్యం చేయడం సరైంది కాదు. పార్టీ రాజకీయాలకు అతీతంగా, దేశ భవిష్యత్తు కోసం ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలి.

**- ప్రధాని మోదీ**

**2024లో సమయం లేక అమలు కాలేదు**

**2029లో కూడా ఆలస్యం అయితే తీవ్ర పరిణామాలు**


**మహిళా రిజర్వేషన్ల ఘనత ప్రతిపక్షాలకే ఇస్తాం: ప్రధాని**

**హోర్డింగ్‌లపై విపక్ష నేతల ఫొటోలు పెట్టేందుకు సిద్ధం**

**మహిళా హక్కులపై రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లుపై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చల మధ్య ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపాయి. మహిళా రిజర్వేషన్ల అమలు విషయంలో అధికార పక్షం ఎలాంటి క్రెడిట్ ఆశించడం లేదని, ఆ ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని ప్రకటిస్తూ విపక్షాలకు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. అవసరమైతే బిల్లు ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వ ఖర్చుతో ప్రతిపక్షాలకు ప్రచారం చేస్తామని, హోర్డింగ్‌లపై వారి ఫొటోలు పెట్టేందుకు కూడా సిద్ధమని వ్యాఖ్యానించడం గమనార్హం. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులపై జరిగిన చర్చలో జోక్యం చేసుకున్న ప్రధాని దాదాపు 40 నిమిషాలపాటు మాట్లాడారు. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించడం అనేది హక్కు అని, దాన్ని ఎవరో ప్రసాదంగా ఇస్తున్నట్టు చూడకూడదని స్పష్టం చేశారు. ఉద్దేశం స్పష్టంగా ఉన్నప్పుడు పదాలపై వాదనలు అవసరం లేదన్నారు. హామీ, గ్యారంటీ, వాగ్దానం ఏ పదం వాడినా తేడా లేదని, లక్ష్యం మాత్రం మహిళలకు సముచిత స్థానం కల్పించడమేనని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనపై నెలకొన్న సందేహాలపై కూడా ప్రధాని స్పష్టత ఇచ్చారు. ఈ ప్రక్రియలో ఏ ఒక్క రాష్ట్రానికీ అన్యాయం జరగదని, లోక్‌సభ స్థానాల నిష్పత్తిలో ఎలాంటి మార్పు ఉండదని తెలిపారు. పెద్ద రాష్ట్రం, చిన్న రాష్ట్రం అనే తేడా లేకుండా సమాన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. దక్షిణ, ఉత్తర రాష్ట్రాల మధ్య వివక్ష ఉండదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుపై ఆలస్యం జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, 2024 ఎన్నికల సమయం తక్కువగా ఉండడం వల్ల అమలు చేయలేకపోయామని వివరించారు. అయితే ఇప్పుడు తగినంత సమయం ఉన్నందున ఇక ఆలస్యం చేయకూడదని అన్నారు. 2029లో కూడా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని హెచ్చరించారు. ఇది కేవలం రాజకీయ అంశం కాదని, దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నిర్ణయమని తెలిపారు. ప్రతిపక్షాల వైఖరిపై విమర్శలు గుప్పిస్తూ,

(మిగతా 2వ పేజీలో)



# తెలంగాణకు 26... ఏపీకి 38 లోక్‌సభ సీట్లు

**దక్షిణాది మొత్తం స్థానాలు 195కి పెరుగుతాయి: అమిత్ షా**

**ప్రాతినిధ్యం తగ్గదని గణాంకాలతో వివరణ.. అపోహలు వద్దన్న కేంద్ర హోంమంత్రి**

**2029 తర్వాతే అమలు స్పష్టత.. జనగణనతో పాటు కులగణన కూడా నిర్వహణ**

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కీలకంగా మారిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. పునర్విభజన అనంతరం తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 38కి పెరుగుతాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో వెల్లడించారు. ఈ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విమర్శలను ఆయన ఖండించారు. గణాంకాలతో సహా వివరాలు వెల్లడిస్తూ, ప్రాతినిధ్యం తగ్గదని, పైగా కొంతమేర పెరుగుతుందని స్పష్టం చేశారు. లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, ప్రస్తుతం ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో కలిపి 129 స్థానాలు ఉన్నాయని, పునర్విభజన తర్వాత అవి 195కి పెరుగుతాయని తెలిపారు. అంటే సుమారు 50 శాతం వృద్ధి చోటుచేసుకుంటుందని వివరించారు. ఈ పెరుగుదలతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 23.76 శాతం నుంచి 23.97 శాతానికి పెరుగుతుందని పేర్కొన్నారు. కాబట్టి దక్షిణాదికి నష్టం జరుగుతుందనే వాదనలకు ఆధారం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రాల వారీగా వివరాలు వెల్లడిస్తూ, తెలంగాణలో సీట్లు 17 నుంచి 26కి పెరగడంతో పాటు ప్రాతినిధ్యం 3.13 శాతం నుంచి 3.18 శాతానికి పెరుగుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 38కి పెరిగి ప్రాతినిధ్యం 4.60 నుంచి

(మిగతా 2వ పేజీలో)



**తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య**

## క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

**తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై ఆగ్రహం**

**తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న**

**ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు**

**తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉంది**

**బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**

హైదరాబాద్: పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై

(మిగతా 2వ పేజీలో)

# తెలంగాణలో బీసీలదే అగ్రస్థానం

**నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం**

**తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం**

**రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి**

**జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి 3 స్థానాల్లో**

**ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీలు అత్యధికం**

**దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం**



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా

(మిగతా 2వ పేజీలో)



## రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్‌రెడ్డి ప్రమాణస్వీకారం

**తనపై నమ్మకంతో కాంగ్రెస్ అవకాశం ఇచ్చింది: నరేందర్ రెడ్డి**

**తెలంగాణ హక్కులపై సభలో పోరాటం చేస్తానని వెల్లడి**

**ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యులు**

న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పలువురు నేతలు రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు, సమస్యలు, రాష్ట్ర హక్కులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ తదితరులు కూడా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.



## కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్‌రెడ్డి కోరాలి: రాంచందర్ రావు

**కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే తెలంగాణలో 17 ఉన్నాయన్న రాంచందర్ రావు**

**ముందు కేరళలో సీట్లు తగ్గించాలని అడగాలని సవాల్**

**కాంగ్రెస్ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపణ**



## తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత


**డీలిమిటేషన్‌లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలన్న కవిత**

**రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ**

**దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం సరికాదని వ్యాఖ్య**

# తెలంగాణకు 26... ఏపీకి 38 లోక్‌సభ సీట్లు

4.65 శాతానికి చేరుతుందని తెలిపారు. తమిళనాడులో 39 నుంచి 59కి, కర్నాటకలో 28 నుంచి 42కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని వెల్లడించారు. డీలిమిటేషన్‌పై ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని విమర్శిస్తూ, ఈ బిల్లులు దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకంగా కాదని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభలో సీట్ల పెంపు అనేది జనాభా ఆధారంగా జరుగుతుందని, అందులో ప్రాంతీయ వివక్షకు చోటు లేదన్నారు. విపక్షాలు ప్రచారం చేస్తున్నట్లు ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి లేదని పునరుద్ఘాటించారు. అమలు విషయంలో కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. డీలిమిటేషన్ కమిషన్ నివేదిక సిద్ధమై, పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాతే అమల్లోకి వస్తుందని చెప్పారు. ఈ మొత్తం ప్రక్రియ 2029కి ముందుగా పూర్తయ్యే అవకాశం లేదని పేర్కొన్నారు. అప్పటివరకు ఎన్నికలు ప్రస్తుత నియోజకవర్గాల ఆధారంగానే జరుగుతాయని తెలిపారు. లోక్‌సభ మొత్తం స్థానాల పెంపుపై కూడా అమిత్ షా వివరించారు. ప్రస్తుతం 543 సీట్లు ఉన్న లోక్‌సభను 50 శాతం పెంచే ప్రతిపాదన ఉందని, అలా చేస్తే మొత్తం సంఖ్య 800 దాటవచ్చని అన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ఈ పెంపు అవసరమని వివరించారు. పెంపు తర్వాత మొత్తం సీట్లు సుమారు 815 లేదా 816 వరకు ఉండవచ్చని అంచనా వేశారు. ఇక దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో భాగంగా కులగణన కూడా చేపడతామని కేంద్రం ప్రకటించింది. దీనిపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని అమిత్ షా పేర్కొన్నారు. ప్రస్తుతం ఇళ్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతోందని, వ్యక్తిగత వివరాల సేకరణ దశలో కులగణన కూడా జరుగుతుందని తెలిపారు. మొత్తంగా డీలిమిటేషన్‌పై నెలకొన్న అనుమానాలకు కేంద్రం గణాంకాలతో సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించినప్పటికీ, రాజకీయ వర్గాల్లో చర్చలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. దక్షిణాది



రాష్ట్రాలకు నిజంగా ప్రయోజనమా? లేక దీర్ఘకాలంలో ప్రభావం మారుతుందా? అన్న ప్రశ్నలపై భవిష్యత్తులో మరింత చర్చ జరిగే అవకాశముంది.

# తెలంగాణలో బీసీలదే అగ్రస్థానం

నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (నీశీ ఝుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.
ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.
బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.
ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.
ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8% జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 %), గోండ్ (1.1%), ఎరుకుల (0.5 %) వారి తర్వాత ఉన్నారు.
ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలకపాత్ర పోషించనున్నాయని భావిస్తున్నారు.

# తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్



ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు శుభవార్త.. 2 కొత్త రైళ్లు ప్రకటించిన రైల్వే శాఖ

**చర్లపల్లి-నర్సాపురం, నర్సాపురం-తిరుపతి మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు**

**ఇప్పటికే ఉన్న ప్రత్యేక రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మార్చిన రైల్వే శాఖ**

**ఇండోర్-లింగంపల్లి-ఇండోర్ హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి వరకు పొడిగింపు**

**వారానికి మూడు రోజుల నుంచి రోజువారీ సర్వీసుగా మారిన కాకినాడ ఎక్స్‌ప్రెస్**

**ఏప్రిల్ చివరి వారం నుంచే అమల్లోకి రానున్న కొత్త రైళ్లు, మార్పులు**



హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త వారపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు మరికొన్ని రైళ్ల సేవలను పొడిగించింది. దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసిన వివరాల ప్రకారం చర్లపల్లి-నర్సాపురం-చర్లపల్లి (17061/17062) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రకటించారు. ఇది ఇప్పటివరకు నడుస్తున్న ప్రత్యేక రైలు స్థానంలో రెగ్యులర్ సర్వీసుగా నడుస్తుంది. మే 2 నుంచి ప్రతి శనివారం రాత్రి 7:50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:50 గంటలకు చర్లపల్లికి వస్తుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది.

అలాగే, నర్సాపురం-తిరుపతి-నర్సాపురం (17428/17427) మధ్య మరో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 27 నుంచి ప్రతి సోమవారం సాయంత్రం 3:50 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 3 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10:10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.

**ఇతర రైళ్ల సేవల్లో మార్పులు**

వీటితో పాటు రైల్వే బోర్డు మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇండోర్-లింగంపల్లి-హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (20916/20915) చర్లపల్లి వరకు పొడిగించారు. ఈ మార్పు ఏప్రిల్ 25 నుంచి అమల్లోకి వస్తుంది. కాకినాడ టౌన్-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను (12775/12776) వారానికి మూడు రోజుల నుంచి రోజువారీ సర్వీసుగా మార్చారు. ఈ రైలుకు సామర్లకోటలో అదనపు హాల్ట్‌ను కూడా కేటాయించారు. ఈ మార్పులు ఏప్రిల్ 21 నుంచే అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త రైళ్లు, మార్పులతో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది.

## పునర్విభజనతో నష్టం ఉండదు: ప్రధాని మోదీ

మహిళా రిజర్వేషన్లను బహిరంగంగా వ్యతిరేకించే ధైర్యం లేక సాంకేతిక సాకులు వెతుకుతున్నారని ఆరోపించారు. మహిళల హక్కులను అడ్డుకోవాలనే ఉద్దేశంతో కొందరు వివిధ కారణాలు చూపుతున్నారని అన్నారు. అయితే దేశంలోని మహిళలు అన్నింటిని గమనిస్తున్నారని, వారి తీర్పు కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్లను రాజకీయ కోణంలో చూడొద్దని ప్రధాని విజ్ఞప్తి చేశారు. ఇది జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశమని, ప్రపంచవ్యాప్తంగా మహిళలు భారత్ నిర్ణయాలను గమనిస్తున్నారని అన్నారు. నిర్ణయాల కంటే వాటి వెనుక ఉన్న ఉద్దేశం ముఖ్యం అని, నిజాయతీ లేకపోతే మహిళలు ఎప్పటికీ క్షమించరని హెచ్చరించారు. సభలో కొందరు సభ్యులు నిరసనగా నల్ల దుస్తులు ధరించి రావడాన్ని ప్రస్తావిస్తూ కూడా ప్రధాని ప్రత్యేకంగా స్పందించారు. నల్ల రంగు దుస్తులను 'కాలా టికా'తో పోలుస్తూ, శుభకార్యాలకు దిష్టి తొలగించడానికి ఉపయోగపడుతాయని వ్యాఖ్యానించారు. నిరసన తెలిపిన వారికీ కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా మహిళా రిజర్వేషన్లపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కొత్త చర్చలకు దారితీశాయి. ఒకవైపు విపక్షాలకు క్రెడిట్ ఇస్తానని చెప్పడం, మరోవైపు వారి వైఖరిపై విమర్శలు చేయడం ద్వారా రాజకీయంగా ఒత్తిడి పెంచే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు దిశగా దేశ రాజకీయాలు మరింత వేగంగా ముందుకు కదిలే సూచనలు కనిపిస్తున్నాయి.

## కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్‌రావు

**కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే తెలంగాణలో 17 ఉన్నాయన్న రాంచందర్ రావు**

**ముందు కేరళలో సీట్లు తగ్గించాలని అడగాలని సవాల్**

**కాంగ్రెస్ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపణ**

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు. కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. మొదట కేరళలో లోక్ సభ సీట్లను తగ్గించాలని రేవంత్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని, డీలిమిటేషన్ చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ కొత్త పార్లమెంటు భవనంలోనే కోరారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ఇప్పుడు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వింత వాదన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

## తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత

**డీలిమిటేషన్‌లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలన్న కవిత**

**రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ**

**దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం సరికాదని వ్యాఖ్య**

తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ఆమె తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో భాగంగా తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణకు ఉన్న 3.13 శాతం ప్రాతినిధ్యాన్ని బేస్‌లైన్‌గా పరిగణించాలని, పునర్విభజన తర్వాత కూడా ఈ శాతం తగ్గకుండా చూడాలని కవిత డిమాండ్ చేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినప్పటికీ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రాతినిధ్యం తగ్గితే అది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత అసహనం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును ఓబీసీ రిజర్వేషన్లతో ముడిపెట్టాలని, 33 శాతం కోటాలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తే వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు.

## దారుణం.. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య

**హన్మకొండ జిల్లా, పరకాలలో దారుణం**

**ఆధారాలు దొరక్కుండా పెట్రోల్ పోసి తగులబెట్టిన నిందితులు**

**భార్య, ప్రియుడు సహా ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు**

హన్మకొండ : హన్మకొండ జిల్లా, పరకాలలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. భర్తను అతి కిరాతకంగా చంపి, ఆధారాలు దొరక్కుండా పెట్రోల్ పోసి తగులబెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పరకాలకు చెందిన సుమన్ ఒక రెస్టారెంటులో పని చేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు. భార్యకు కమలాపూర్ మండలం వంగపల్లికి చెందిన ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో తన భర్తను వదిలించుకోవాలనుకున్న లావణ్య, ప్రియుడితో కలిసి చంపేందుకు ప్లాన్ వేసింది. ఇందుకోసం ఒక ముఠాకు సుఫారీ ఇచ్చింది. ఈ క్రమంలో ఆమె కొద్దిరోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. ఆ తర్వాత, ఈ నెల 3వ తేదీ నుంచి భర్త సుమన్ కనిపించకుండా పోయాడు. కొడుకు కోసం వెతికిన సుమన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భార్యపై అనుమానం వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ జరపగా, ప్రియుడితో కలిసి భర్తను చంపినట్లు అంగీకరించింది. సుఫారీ గ్యాంగ్ మొదట అతనిని బీరు సీసాలతో విచక్షణారహితంగా పొడిచి చంపింది. ఈనెల 4వ తేదీన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దయ్యాలవాగు సమీపంలో సుమన్‌పై పెట్రోల్ పోసి కాల్చివేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, ఆ తర్వాత ఎనిమిది మందిని అరెస్టు చేశారు. లావణ్యతో పాటు ప్రియుడు, సుఫారీ తీసుకున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# ప్రజలకు సక్రమమైన మంచినీరు, మురుగునీటి రహిత వాతావరణాన్ని అందించేలా చర్యలు చేపట్టాలి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 16(వాయిస్ టుడే): పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డివిజన్లో, బస్తీలలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి పైప్ లైన్ కనెక్షన్ల నిర్మాణము, పైప్ లైన్ మరమ్మతు పనులపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సుమారు 2.04 కోట్ల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా పైప్లైన్ పనులను త్వరగా ప్రారంభించి, పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోజురోజుకు పెరుగుతున్న జనాభా వెలుస్తున్న కాలనీలలో భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు ప్రణాళికలు రచించి నూతన పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించే దిశగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అవసరమైన చోట రిజర్వాయర్లను నిర్మించి భవిష్యత్తు అవసరాలకు సరిపోయే విధంగా త్రాగునీటిని అందించే వైపుగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నేటి ఎద్దడి కలగకుండా అధికారులు ప్రజలకు నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంలమాధవి, పరిమళ, వివిధ సెక్షన్ల డీజీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై ఎంపీ వద్దిరాజు ఆగ్రహం

### - వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్



ఢిల్లీ (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వంలో ప్రజలు అహింసా మార్గంలో దీర్ఘకాలం ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం ప్రపంచానికి తెలిసిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని పక్కనపెట్టి తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమైనవని తీవ్రంగా విమర్శించారు. దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడటం ద్వారా తెలంగాణ ప్రజలను అవమానించారని పేర్కొంటూ, వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. అలాగే, ప్రజల ఓట్లతో ఎన్నికైన తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కర్నాటకకు చెందిన తేజస్వీ సూర్య చేసిన అసందర్భ, అసంబద్ధ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాలని ఆయన కోరారు.



## ఏప్రిల్ 20 దరువు జాతరను విజయవంతం చేయండి : మంత్రి జూపల్లి కృష్ణారావు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 16(వాయిస్ టుడే) : దరువు తెలంగాణ సాంస్కృతిక చైతన్య వేదిక ఏర్పడి నేటికీ 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఈనెల 20 తారీఖున రవీంద్రబారతి లో జరిగే దరువు జాతరను వేలాదిగా కళాకారులు తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా టూరిజం మరియు భాషా సాంస్కృతిక శాఖ ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్ లో దరువు కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో దరువు వ్యవస్థాపకులు దరువు ఎల్లన్న దరువు రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు కాజా పాషా తదితరులు పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 16(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఢిల్లీలో పార్లమెంట్ ఆవరణలో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన కాంగ్రెస్ నాయకులు వేం నరేందర్ రెడ్డి గారి ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.అనంతరం శ్రీశైలం గౌడ్ రాజ్యసభ సభ్యులు పెద్దలు వేం నరేందర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన పెద్దలు వేం నరేందర్ రెడ్డి రాజ్యసభలో తెలంగాణ వానిని మరింత బలంగా వినిపించి తెలంగాణ అభివృద్ధి వారి భాగస్వామ్యం మరింత ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి , మరియు హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకుడు బొమ్మ శ్రీరాం పాల్గొన్నారు.



## స్థానిక సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 16(వాయిస్ టుడే): జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని గురువారం రోజు( మగ్దూం నగర్ నుండి బీరప్ప నగర్ వరకు (సీసీ. రోడ్స్ ) పనులను డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పరిశీలించారు ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. .సీసీ. రోడ్డ్ . పనులను అతి త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏఈ రాధాకృష్ణరెడ్డి. వేణు యాదవ్ మోహన్ రెడ్డి నరేష్ రాజు. సంపత్ రెడ్డి సునీల్ రెడ్డి.బస్తీ వాసులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో 114 ఒలంపియాడ్ అవార్డులు అందుకున్న వైష్ణవి స్కూలు విద్యార్థులు




విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతూ విద్యారంగంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్న వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. హైదరాబాద్లో భారతీయ విద్యాభవన్ లో జరిగిన ఈ అభ్యాస్ ఒలంపియాడ్ అవార్డు ఫంక్షన్ కార్యక్రమంలో వైష్ణవి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సంవత్సరం మొత్తం మీద నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలలో వైష్ణవి స్కూల్ విద్యార్థులు 114 మంది రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించడం జరిగింది.

పాఠశాల అందిస్తున్న ఉన్నత స్థాయి శిక్షణ విద్యార్థులను ప్రపంచ స్థాయిసవాళ్లకు సిద్ధం చేస్తుంది. వందలాది పాఠశాలల మధ్య మన విద్యార్థులు అగ్రస్థానంలో నిలవడం గర్వకారణం. రాష్ట్ర స్థాయి ర్యాంకులు అందుకుంటున్న విద్యార్థుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల అంకితభావం తల్లిదండ్రుల ప్రోత్సాహం ఈ విజయానికి పునాది చెప్పడం

ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా నూతన విద్యా విధానాలను అమలు చేస్తూ విద్యార్థుల ఆలోచనా శక్తిని పెంపొందిస్తున్నాము. సాంకేతికతను జోడిస్తూ అందిస్తున్ననాణ్యమైన బోధనే పాఠశాలను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టింది. ఈ అద్భుత విజయాలలో నెష్ణవి విద్యా సంస్థ జిల్లా స్థాయిలోనే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమ విద్యా కేంద్రంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ విజయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ అభ్యాస్ జజుూ ఫిణే పవన్ ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూ విద్యార్థుల ప్రతిభను మెరుగుపరుస్తూ రాష్ట్ర స్థాయి గుర్తింపును తెస్తున్నందుకు వారికి వైష్ణవి స్కూల్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు అందుకున్న విద్యార్థులు జరీన్ ఫాతిమా, మాహీన్ ఫాతిమా, చరిత, తబస్సుమ్, హేమశ్రీ నిఖిల్ జోష్, అమూల్య బిందుశ్రీ శశిధర్, బాబూజీ, జరీన్ ఫాతిమా, అక్షయ భాగ్యలక్ష్మి హిమంత్

## పూలే ద్విశత జయంతి కమిటీలో ఆర్. కృష్ణయ్యకు స్థానం

**బీసీ ఉద్యమానికి జాతీయ గౌరవం**

**మోదీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు**

**దశాబ్దాల పోరాటానికి గుర్తింపు బీసీ సాధికారతకు కొత్త దిశ**




హైదరాబాద్, ఏప్రిల్ 16: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించబడనున్న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల జాతీయ కమిటీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య (టైగర్ ఆర్. కృష్ణన్న) సభ్యునిగా ఎంపిక కావడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, లోక్‌సభ స్పీకర్‌తో పాటు 34 మంది కేంద్ర మంత్రులు, 25 రాష్ట్రాల ముఖ్యమంత్రులు భాగస్వాములవడం ఈ ఉత్సవాల విస్తృతిని స్పష్టంగా తెలియజేస్తోంది. బీసీ వర్గాల హక్కుల సాధన కోసం దశాబ్దాలుగా నిరంతర పోరాటం సాగించిన ఆర్. కృష్ణయ్యకు ఈ కమిటీలో స్థానం కల్పించడం గౌరవప్రదమైన నిర్ణయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు. బీసీ ఉద్యమ చరిత్రలో ఆర్. కృష్ణయ్య పోరాటాలు కీలక మలుపు తిప్పాయని ఆయన వివరించారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా బీసీ విద్యార్థుల కోసం గురుకుల విద్యాసంస్థలు, బీసీ హాస్టల్స్ ఏర్పాటు చేయించడంలో ఆయన పోరాటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ సంస్థలు పెద్ద ఎత్తున దోహదపడ్డాయని తెలిపారు. అలాగే, బీసీ విద్యార్థులు చదువుకుంటేనే సమాజంలో చైతన్యం పెరిగి, ఆ చైతన్యం వారిని రాజ్యాధికార వైపు దారితీస్తుందనే దృఢ నమ్మకంతో ఆర్. కృష్ణయ్య ఉద్యమాలను ముందుకు నడిపారని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ఈ దిశగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కోచింగ్ సదుపాయాలు, హాస్టల్స్ వంటి అనేక సంక్షేమ పథకాలను సాధించడం ఆయన ఉద్యమ విజయాల ప్రతిఫలమని పేర్కొన్నారు. ఈ చర్యలు లక్షలాది బీసీ విద్యార్థుల భవిష్యత్తును మార్చడంతో పాటు, సమాజంలో విద్యా సమానత్వాన్ని బలోపేతం చేశాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2028 ఏప్రిల్ 11 వరకు కొనసాగనున్న ఈ కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పూలే ద్విశత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో ఈ వేడుకలను విజయవంతం చేయాలని గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. "బీసీలు విద్యతో చైతన్యవంతులై రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలన్న లక్ష్యంతో సాగిన ఉద్యమం నేడు ఫలితాలను ఇస్తోంది. ఈ వేడుకలు ఆ దిశగా మరింత ప్రేరణనిస్తాయి" అని గుజ్జ సత్యం పేర్కొన్నారు.

## సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ విద్యార్థులు 100% విజయం





హైదరాబాద్, ఏప్రిల్ 16: ప్రార్థనా మణికొండ నేతృత్వంలో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ సీబీఎస్ఈ 10వ తరగతిలో 100% విజయ దుందుభి మ్రోగించి అనూహ్య ఫలితాలు సాధించింది. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్, హిమాయత్ నగర్ కి చెందిన చీఫ్ ప్యాట్రన్ వేద కుమార్ మణికొండ, డైరెక్టర్ శ్రీమతి ప్రార్ధనా మణికొండ నేతృత్వంలో సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో 100% విజయాన్ని సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రుల సమక్షంలో ఆనందంగా ఉన్న విద్యార్థులను సత్కరిస్తూ శ్రీమతి ప్రార్ధనా మణికొండ మాట్లాడుతూ.. "విజయం అనేది నిరంతర శ్రమ, బలమైన పునాది, మరియు నిరంతర అభ్యాసానికి ప్రతిబింబం. ఇది అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు, కృషిశీల గల విద్యార్థులు, వారికి సదా సహకరించే తల్లిదండ్రులు మరియు సమర్థవంతమైన విద్యా వ్యూహాల సమన్వయంతో సాధ్యమవుతుందని అన్నారు. ఈ సంవత్సరం 100% ఫలితం ప్రత్యేకమైనది, ఎందకంటే మొత్తం శాతం అత్యంత ఉన్నతంగా ఉండి, అనేక మంది విద్యార్థులు అధిక మార్కుల శ్రేణిలో నిలిచారు. ఈ అద్భుతమైన ఫలితాలు పాఠశాల యొక్క సూత్రపరమైన అవగాహన, నైపుణ్యాభివృద్ధి, క్రమశిక్షణ మరియు సమగ్ర విద్య పట్ల ఉన్న నిబద్ధతనం ప్రతిబింబిస్తున్నాయి. ఈ విజయాలను క్రమబద్ధమైన పునశ్చరణ ప్రణాళికలు మరియు గణితంలో అదనపు సహాయం అవసరమైన విద్యార్థులకు ఉచిత రెమిడియల్ తరగతుల వంటి ప్రత్యేక చర్యలు మరింత బలోపేతం చేశాయి" అని తెలిపారు.

ఈ అద్భుత విజయానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు యాజమాన్యం కలసి చేసిన కృషి ప్రధాన కారణమని చెప్పారు. ఆమె దూరదృష్టి గల నాయకత్వంలో ఈ విద్యాసంస్థ ప్రగతి మార్గంలో ముందుకు సాగుతూ నిరంతరంగా అభివృద్ధి చెందంతోంది. విజయయాత్ర శ్రీమతి ప్రార్ధనా మణికొండ నాయకత్వంలో పాఠశాల ఈ విజయయాత్రను కొనసాగిస్తోంది. స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ప్రిన్సిపల్స్ రేఖ రావు , ఫాతిమా కాజిమ్ లో విద్యార్థులను వారి యొక్క అద్భుత ఫలితాల పై అభినందించారు.

## చైతన్య అమీర్‌పేట్-1 బ్రాంచ్‌లో ఫ్యామిలీ ఫెస్ట్






జూబ్లీహిల్స్ 16 ఏప్రిల్( వాయిస్ టుడే ): అమీర్‌పేట్-1లోని శ్రీ చైతన్య బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం భాగంగా ఫ్యామిలీ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాద పూజ చేసి ఆశీర్వాదాలు పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కారం, సామాజిక విలువలతో కూడిన విద్య అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే "హ్యాపీ క్లబ్ 2.0" కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులను ఉత్సాహపరుస్తూ వివిధ ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హరికృష్ణ, కోఆర్డినేటర్ మురళికృష్ణ, ప్రిన్సిపల్ ప్రశాంతి కిరణ్, డీన్ రామ శ్రీకాంత్ గౌడ్, సిబ్యాచ్ ఇన్‌చార్జ్ కళ్యాణి, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ ఎప్పుడు...?

**జర్నలిస్టులకు రక్షణ ఏది...?**

**దాడులు, బెదిరింపులు పెరుగుతున్న వేళ చట్టం కోసం టీజెఎస్ఎస్ డిమాండ్...**

**టీజెఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ...**

సికింద్రాబాద్ ఏప్రిల్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" అత్యవసరమని టీజెఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం నిత్యం శ్రమించే ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణించే మీడియా ప్రతినిధులకే రక్షణ లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఎవరు పడితే వారు దాడులకు దిగుతున్నారన్న ఆందోళన

రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు, గల్లీ స్థాయి నాయకులు, వారి అనుచరులు ఇలా ఎవరు పడితే వారు జర్నలిస్టులపై దాడులకు, బెదిరింపులకు దిగుతున్నారని గౌటి రామకృష్ణ విమర్శించారు. వాస్తవాలు రాస్తున్నందుకు, అవినీతి, అక్రమాలు వెలికితీస్తున్నందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు.



**ఆధారాలు లేకుండా కేసులు, పోలీసుల వైఖరి మారాలి**

చాలా సందర్భాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండానే జర్నలిస్టులపై కేసులు నమోదు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖ కూడా వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ఫిర్యాదు చేశారన్న నేపంతో ముందుగా జర్నలిస్టులపైనే చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. కొందరు రాజకీయ నాయకుల, అధికారుల ఒత్తిడికి పోలీసులు లోనై నిర్దోషులైన జర్నలిస్టులను జైలుకు పంపించడం ఆందోళన కలిగించే విషయం అని అన్నారు.

**ఫోర్త్ ఎస్టేట్ విలువ కావాలని తగ్గిస్తున్నారా.?**

ప్రజల సమస్యలను, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా విలువను కొందరు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని గౌటి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన రంగంలో పనిచేసే జర్నలిస్టులకే రక్షణ లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని హెచ్చరించారు. అందుకోసమే "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" అత్యవసరం అన్నారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు అరికట్టాలంటే ప్రత్యేక చట్టం అవసరమని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు. జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి వస్తేనే మీడియా ప్రతినిధులు భయంలేకుండా పని చేయగలరని అన్నారు. ఈ చట్టం ద్వారా దాడులకు, బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా నిబంధనలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

**అందరూ ఏకతాటిపైకి రావాలి**

జర్నలిస్టులు సంఘాలకు అతీతంగా ప్రతి జర్నలిస్టు, ప్రతి సంఘ నాయకుడు ఒకే వేదికపైకి రావాలని గౌటి రామకృష్ణ పిలుపునిచ్చారు. "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" సాధన కోసం సమిష్టిగా పోరాడితేనే ఫలితం సాధ్యమవుతుందని అన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల రక్షణ కోసం చట్టం తీసుకురాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టుల భద్రత కోసం పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని గౌటి రామకృష్ణ స్పష్టం చేశారు.



పార్లమెంట్ వేదికగా రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న వేం నరేందర్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి )



## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను తొలగించడం సబబు కాదు

**:- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- చర్లపల్లి బస్టాండ్‌లో గత నాలుగు రోజుల క్రితం ఏర్పాటు చేసిన మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి సమయంలో తొలగించడం పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాల తొలగింపును ఆయన తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులను గుర్తించి చర్యలు చేపట్టాలని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ని కోరారు. మహనీయుల విగ్రహాలను తొలగించడం సమాజానికి అవమానం అని వెంటనే విగ్రహాలను పునఃప్రతిష్ట చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసే వరకు విశ్రమించబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ ఘటనకు సంబంధించి అరెస్టు అయిన వారిని పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి విడుదల చేయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.



## త్వరలో మైదానం కోసం ఇంటింటి సంతకాల సేకరణ కార్యక్రమం : రావుల శ్రీధర్ రెడ్డి

జూబ్లీహిల్స్ 16 ఏప్రిల్ (వాయిస్ టుడే )రహేమత్ నగర్ డివిజన్‌లోని ఎస్ పి ఆర్ హిల్స్ క్వారీ మైదానాన్ని కాపాడాలని స్థానికులు కదిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో ఇంటింటి సంతకాల స్వీకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ (యాజుఔ×ణజ ) టీఎస్ ఈ డబ్ల్యూ ఐ డి సి.చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ మైదానం యువతకు క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలకు మాత్రమే కాకుండా, వాకింగ్ మరియు పండుగల సమయంలో సామూహికకార్యక్రమాలకు ముఖ్య కేంద్రంగా ఉపయోగపడుతోందన్నారు. ఇక్కడ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం జరిగితే ఓపెన్ స్పేస్ తగ్గిపోవడంతో పాటు క్రీడలు, ప్రజల వినియోగం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వుమెన్స్ హాస్టల్ నిర్మాణానికి ఇతర ప్రభుత్వ భూములను కేటాయించాలని సూచిస్తు.ఈ మైదానాన్ని క్రీడా మైదానంగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయి సదుపాయాలతో ఎస్పిఆర్ హిల్స్ మైదానాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

## కూకట్‌పల్లి నియోజకవర్గానికి అత్యధిక ప్రాధాన్యత

**-- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**



కూకట్ పల్లి; ఏప్రిల్ 16(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గానికి జిల్లా పార్టీలో జరిగే ప్రతి నియామకంలో అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సలీం ఆధ్వర్యంలో ఇటీవల నూతన కమిటీని ఎంపిక చేసిన సందర్భంగా, పదవులు పొందిన వారిని గురువారం కూకట్‌పల్లి పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్, నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ కీలక సూచనలు చేశారు."ఎన్నిక ఏదైనా గెలుపే లక్ష్యం కావాలి. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అదే దిశగా సమన్వయంతో పనిచేయాలి" అని అన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు ముందుండాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిర్ణయాలకు నిరసనగా ఎన్ఎస్‌యూఐ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 18న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి కి ఘన శుభాకాంక్షలు

**-- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**



కూకట్ పల్లి; ఏప్రిల్ 16(వాయిస్ టుడే): కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా నేడు ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డికి పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డా. సత్యం శ్రీరంగం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. "పార్లమెంట్‌లో తెలంగాణ వాణి మరింత బలంగా వినిపించాలి"ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన వేం నరేందర్ రెడ్డి తెలంగాణ ప్రజల సమస్యలు, హక్కులు, నిధుల కోసం పార్లమెంట్‌లో బలంగా పోరాడాలని కోరారు. ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే ఆయన వంటి నాయకుడు, రాజ్యసభలో తెలంగాణ వాణిని మరింత శక్తివంతంగా వినిపిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్ష వేం నరేందర్ రెడ్డి భవిష్యత్తులో మరింత ప్రజా సేవ చేసి, ప్రజల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి ఆయన భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఇతర తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ హక్కుల సాధనలో రాజ్యసభలో మరింత గళం వినిపించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి అభినందనలు

## దళిత రత్న పురస్కారం అందుకున్న కొరపాక అంజి మాదిగ




నాచారం (వాయిస్ టుడే): డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత రత్న పురస్కారాల కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొరపాక అంజి మాదిగ దళిత రత్న పురస్కారం అందుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ ఉద్యమంలో కట్టుబడి పనిచేస్తూ, సామాజిక సేవలో ముందుండి సేవలందిస్తున్నందుకు ఈ పురస్కారం లభించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు కృషి చేయడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తన ప్రయాణాన్ని గుర్తించి, మహనీయుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా అన్ని విధాల సహకరిస్తూ దళిత బహుజన పేద వర్గాల కుటుంబాలకు అండగా నిలిచినందుకు ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దళిత రత్న పురస్కారాన్ని అందజేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్.వై. అశోక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవలో మరింతగా కృషి చేస్తానని కొరపాక అంజి మాదిగ పేర్కొన్నారు.



## దళితుల బస్తీలో అన్యాయం చేస్తున్న బిల్డర్లు -- ఎర్రగడ్డలో ఆందోళన

జూబ్లీహిల్స్ 16 ఏప్రిల్ (వాయిస్ టుడే): ఎర్రగడ్డలోని ఓల్డ్ సుల్తాన్ నగర్ దళిత బస్తీలో నివసిస్తున్న ప్రజలు గత ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాంతంలో జరుగుతున్న రాళ్లు పగలగొట్టడం, బర్మా (డ్రిల్లింగ్) పనుల కారణంగా భారీ శబ్దాలు వస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ శబ్దాల ప్రభావంతో ఇళ్ల గోడలు పగుళ్లు పడుతున్నాయని, రాత్రి వేళల్లో కూడా పనులు కొనసాగడంతో నిద్రలేమితో బాధపడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయంపై ప్రజా భవన్‌లో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్థానిక నాయకులు ఈ పనులకు మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి డ్రిల్లింగ్ పనులను నిలిపివేసి, బాధిత ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం



సికింద్రాబాద్ (వాయిస్ టుడే): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాణికేశ్వర్ నగర్ స్ట్రీట్ నెంబర్ 6కు చెందిన సుదర్శన్(40) కూలీ పనులు చేసుకుంటు కుటుంభంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కుటుంభంలో తలెత్తిన వివాదాలతో ఈ నెల 13న ఇంట్లో నుంచి చెప్పా పెట్టకుండా వెళ్లాడు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంది. ఇప్పటికి తిరిగి రాలేదు. దీంతో అతని తల్లి లక్ష్మీ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదృశ్యమైన వ్యక్తికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాణికేశ్వర్నగర్ తన అత్తగారి



## దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది

**– మాధవరం కాంతారావు**

కూకట్ పల్లి; ఏప్రిల్ 16(వాయిస్ టుడే): మహిళా రిజర్వేషన్ బిల్లు, రాజ్యాంగ (131వ) సవరణ బిల్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ వంటి కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడంపై భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలను 850కి పెంచాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోందని, తాజా జనాభా లెక్కల ఆధారంగా ఈ పునర్విభజన ప్రక్రియ చేపట్టనున్నారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్ల అమలు సులభతరం అవుతుందని, రాష్ట్ర అసెంబ్లీల పరిధి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక దక్షిణాది ప్రజలను విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారమే పునర్విభజన జరుగుతోందని, ఇది దొడ్డిదారిలో చేస్తున్న ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు, ఒకే విలువ అనే ప్రాథమిక సూత్రం అమలు కావాలంటే పునర్విభజన అనివార్యమని ఆయన పేర్కొన్నారు. మోడీ నాయకత్వం: వ్యూహం మరియు నాయకత్వ పటిమ పై భారత ప్రజల్లో చెరగని విశ్వాసం ఉందని, ఈ మూడు కీలక బిల్లుల ప్రవేశపెట్టడంతో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే దిశగా అడుగులు వేస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కాంతారావు ధన్యవాదాలు తెలిపారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
శుక్రవారం 17 ఏప్రిల్ 2026



## రాజ్యాంగ వ్యతిరేక మోడీ ప్రభుత్వ డీలిమిటేషన్

తొర్రూరు , ఏప్రిల్ 16 వాయిస్ టుడే : కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని లిసిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలలో వివక్షతతో చూసే విధశీమంగా ఉందని అన్నారు. ఫెడరల్ స్ఫూర్తి కి పూర్తిగా విఘాతం కలుగుతుందని గుత్తాధిపత్యం ఏర్పడి సహజ నాయ సూత్రాలను తుంగలో తొక్కిక్కుతుందని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం భారత భారత రాజ్యాంగంలో 131 వ అధికరణను సవరించి ఎంపిక చేయనున్నారని ఇది దక్షిణాది రాష్ట్రాలకు తీరని ద్రోహం చేస్తుందన్నారు. జనాభా నియంత్రణలో ఉత్తరాది రాష్ట్రాల కంటే చైతన్యవంతంగా దక్షిణాది రాష్ట్రాలు అమలు చేసిన కారణంగా జనాభా లెక్కల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలలో 38.1 శాతం నుండి 48.1 శాతంవరకు పెరగగా దక్షిణాది రాష్ట్రాలలో 24.3 నుండి 20.7కు తగ్గుతుందని అన్నారు. 50 శాతం పార్లమెంట్ స్థానాల పెంపు గంపగుత్తగా అనేది కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు ఆలోచనలోని భాగమని ఆయన అన్నారు. ఉత్తర దక్షిణాది రాష్ట్రాలకు నిధులు కేటాయించే విషయంలో ఇప్పటికే వివక్షత కొనసాగుతుందని చర్చ నేపథ్యంలో పార్లమెంట్లు సీట్ల కేటాయింపులో అదే వ్యత్యాసం కొనసాగుతుందన్నారు. అదే ఆలోచన బలపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లో కొచ్చే ప్రమాదం ఉందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. పార్లమెంటులో మెజారిటీ ఉందనే పేరుతో ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య సమతుల్యతను దెబ్బతీస్తే కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని ఆయన అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ పేరుతో గతంలో మోడీ సర్కార్ తీసుకొచ్చిన సవరణ హిట్లర్ నూతన చట్టం లాంటిదేనని ఆయన గుర్తు చేశారు. దీనిపై ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఐక్యమై ఉద్యమించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, డివిజన్ నాయకులు ఊడుగుల రాములు, బూర్గుల మోష ,చింతా నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## మాటేడు గ్రామాన్ని సందర్శించిన రిటైర్డ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి

తొర్రూరు, ఏప్రిల్ 16 వాయిస్ టుడే : మాటేడు గ్రామానికి చెందిన కల్వకొలను బాలకిషన్ రాజు ఇండియన్ రెవెన్యూ సర్వీసు లో జీఎస్టీ కమీషనర్గా 33 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించి, పదవీ విరమణ అనంతరం తన స్వగ్రామమైన మాటేడును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తాను చదువుకున్న పాఠశాల, గ్రామ దేవాలయం, గవర్నమెంట్ సబ్ సెంటర్ను సందర్శించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని చిన్నారులతో మమేకమయ్యారు.

తన చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకుంటూ,ఏడవ తరగతి వరకు గ్రామంలో చదివి, 8వ తరగతి నుండి తొర్రూరు పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లి చదివాను. కష్టపడి చదివి యూపీఎస్సీలో మంచి ర్యాంక్ సాధించి ఇండియన్ రెవెన్యూ సర్వీస్ లో చేరాన ని తెలిపారు. ఈ విజయానికి తన తల్లిదండ్రులు, గురువులే కారణమని కృతజ్ఞతతో గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో స్కూల్ బ్యాగులు కూడా లేని పరిస్థితులను గుర్తుచేసుకుంటూ, సుమారు లక్షరూపాయల విలువైన పాఠశాల బ్యాగులను విద్యార్థులందరికీ అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని, అప్పుడు మాత్రమే తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామానికి నిజమైన రుణం తీర్చుకున్నవారమవుతామని అన్నారు. తదుపరి ప్రైమరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, వారికి లంచ్ బాక్సులు అందజేశారు. పాఠశాల అవసరాల కోసం ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలోని గవర్నమెంట్ సబ్ సెంటర్ను సందర్శించి, అవసరమైన వైద్య పరికరాలను అందిస్తానని తెలిపారు. గ్రామ ప్రజలను కలుసుకుంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్ సునీల్ కుమార్, జిల్లా సి డబ్ల్యూ సి చైర్పర్సన్ డాక్టర్ నాగవాణి, మాజీ సర్పంచ్ పినాకపాణి, రిటైర్డ్ హెడ్మాస్టర్లు నరసింహారెడ్డి, భాస్కరాచారి, జనార్ధన్ రాజు, లేగల వెంకటరెడ్డి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య, రిటైర్డ్ టీచర్ రాజగోపాలచారి, సూర హరికృష్ణ, బుర్ర సురేష్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇ.వి.సతీష్ రావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్లా

హనుమకొండ (వాయిస్ టుడే) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ ఈసీ మెంబర్ ఇ.వి. శ్రీనివాస రావు సోదరుడు ఇ.వి. సతీష్ రావు ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా సతీష్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి మృతికి గల కారణాలను తెలుసుకుని సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర రావు,బీఆర్ఎస్ జిల్లా నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు,గురిజపల్లి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలప్రగతికి ప్రణాళికలు రూపొందించుకోవాలి

## తొర్రూరు ఆర్డీవో గణేష్



తొర్రూరు, ఏప్రిల్ 16 వాయిస్ టుడే : పల్లెల ప్రగతికి ప్రణాళికలు రూపొందించుకోవాలని తొర్రూరు ఆర్డీవో గణేష్ తెలిపారు. మండలంలోని వెలికట్ట శివారు శ్రీనివాస గార్డెన్ లో ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఆయా శాఖల అధికారులు హాజరైన సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్యం, సంక్షేమం, విద్యా రోడ్డు భద్రత, స్త్రీ, శిశు సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు.ఎంపీడీవో కూస వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ నిర్వహణలో చేపట్టిన సమావేశంలో ఆర్డిఓ మాట్లాడారు.పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించడంతోపాటు భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యచరణను చేపట్టిందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకు వెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు.వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, పారదర్శకతకు పెద్దపీటవేయాలన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు లేని గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిపక్ష అధికార పక్షానికి కొమ్ము కాయకుండా గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని మడిపల్లి సర్పంచ్ నలుగురి రామలింగం కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అందరి చేయూత అవసరమని సోమారం సర్పంచ్ కొమురవెల్లి లింగమూర్తి కోరారు.కాగా తొర్రూరు మున్సిపల్ కౌన్సిలర్లలో ముగ్గురు మాత్రమే ప్రతిష్టాత్మక సమావేశానికి హాజరు కావడం, మిగతా కౌన్సిలర్లు తమకేమీ సంబంధం అన్నట్లు దుమ్మా కొట్టడం పట్ల సమావేశంలో చర్చించుకున్నారు. బాధ్యతగల కౌన్సిలర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు ఎదురయ్యాయి.ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి విజయ్ చందర్, తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్,మిషన్ భగీరథ ఈఈ సురేందర్, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్,ఎస్సై అంజమ్మ, ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సభ్యత్వం రద్దుచేయాలి

**తెలంగాణను పాకిస్తాన్ ఏర్పాటుతో పోల్చడం సిగ్గుచేటు**

**తెలంగాణ పట్ల బీజేపీ కుటిల వైఖరి బయటపడింది**

**ఎంపీ వ్యాఖ్యలకు టీ-బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలి**

**ఎంపీ తేజస్వి వ్యాఖ్యలను ఖండించిన సందెల విజయ్**



కాజీపేట (వాయిస్ టుడే) : బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సభ్యత్వం రద్దుచేయాలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సందెల విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కర్ణాటక కు చెందిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్ పాకిస్తాన్ విభజనతో పోలుస్తూ గురువారం పార్లమెంటులో చేసిన వ్యాఖ్యల పట్ల కాజీపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సందెల విజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఎంపీ తేజస్వి సూర్య మతి తప్పి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వేలాదిమంది తెలంగాణ బిడ్డల ప్రాణాల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణను పాకిస్తాన్ ఏర్పాటుతో పోల్చడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో మాట్లాడిన తీరుపై తెలంగాణ బిజెపి ఎంపీలు వివరణ ఇవ్వాలన్నారు. తేజస్వి సూర్య మాట్లాడుతుంటే కనీసం అడ్డుకునే స్థితిలో కూడా బిజెపి తెలంగాణ ఎంపీలు లేకపోవడం సిగ్గుచేటు అని,తెలంగాణ పట్ల ఏమాత్రం గౌరవం ఉన్న వెంటనే బిజెపి పార్టీకి వారూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలతో తెలంగాణపై బిజెపి పార్టీకి ఉన్న కుటిల బుద్ధి బయటపడిందని సందెల విజయ్ కుమార్ విమర్శించారు. ఇకనైనా తెలంగాణ ప్రజలు రాష్ట్రంలోని బిజెపి పార్టీకి సరైన సమయంలో సమాధానం చెప్పాలని కోరారు. ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని..లేనిపక్షంలో బిజెపి ఎంపీలకు, నాయకులను నిరసన జ్వాలలు తప్పవని సందెల విజయ్ కుమార్ హెచ్చరించారు.

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో (వాయిస్ టుడే) : పిట్లం, ఏప్రిల్ 16: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు రాజ రాజేశ్వరి ఫంక్షన్ హాల్లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పిట్లం ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత, ప్రమాద సమయంలో కీలక సమయం ప్రాముఖ్యత, ప్రాణ రక్షణ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పిట్లం మండల ప్రెస్ మిత్రులకు ఉచిత హెల్మెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి తప్పనిసరిగా పాల్గొనాలని పిట్లం ఎస్సై ఆంజనేయులు కోరారు.



## దళిత సేవకు గౌరవ ప్రతిష్ఠ మన్నె నరసింహకు "దళితరత్న" అవార్డు

హైదరాబాద్ ; ఏప్రిల్ 16(వాయిస్ టుడే): రాష్ట్ర మంత్రి క్వార్టర్స్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన "దళితరత్న" అవార్డును అందోల్ నియోజకవర్గం ఉసిరికపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది మన్నె నరసింహ ఘనంగా స్వీకరించారు.

సామాజిక న్యాయం, దళితుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల మధ్య సేవా భావంతో ముందుకు సాగుతున్న మన్నె నరసింహ సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేయడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వ్యక్తులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఈ అవార్డు అందుకోవడం ద్వారా మన్నె నరసింహ దళిత సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ, యువతకు స్ఫూర్తిగా మారారని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని మన్నె నరసింహను అభినందించారు.

## పిట్లంలో యువకుడు చెరువులో పడి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూర, ఏప్రిల్ 16: కామారెడ్డి జిల్లాబి పిట్లం గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాస్ (30) అనే యువకుడు పెద్ద చెరువులో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. శ్రీనివాస్ గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం సుమారు 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అనంతరం ఉదయం 11 గంటల సమయంలో గ్రామానికి చెందిన గొల్ల సాయిలు శ్రీనివాస్ పెద్ద చెరువు వైపు వెళ్లినట్లు గమనించి అతని తండ్రి బాలయ్యకు సమాచారం అందించాడు. వెంటనే చెరువు వద్దకు వెళ్లి చూడగా నీటి ఒడ్డున శ్రీనివాస్ చెప్పులు కనిపించాయి. అనంతరం జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా చెరువు ఒడ్డుకు కొద్ది దూరంలో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై శ్రీనివాస్ తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు పిట్లం ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చందుర్తిలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక మండల సభ

**హాజరైన రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు... పలువురు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ**



చందుర్తి, ఏప్రిల్ 16 (వాయిస్ టుడే): చందుర్తి మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద చందుర్తి మండల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక మండల సభ గురువారం నిర్వహించగా ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గీతం తో ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశం వినిపించారు. అరైవ్.. అలైవ్ కింద ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రత నియమాలు వివరించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వా గార్డ్ నీటి శుద్ధి యంత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ డ్రోన్, పలువురు లబ్ధిదారులకు మూడు నెలల సన్నబియ్యం పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కింద 525 మందికి మంజూరు చేయగా, 98 మంది లబ్దిదారుల ఇండ్లు పూర్తి అయ్యాయని, 427 ఇండ్లు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ల పథకం ద్వారా 6,688 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని ఎంపీడీఓ రాధ వివరించారు. కొత్తగా 1,255 కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు అందించామని తెలిపారు. 3,535 మంది రైతులు రైతు రుణమాఫీ పథకం ద్వారా లబ్ధి పొందారని, 10,867 మంది రైతులు రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి పొందారని ఎంపీడీఓ పేర్కొన్నారు. 7,064 కుటుంబాలు గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ పొందుతున్నాయని, 10 మంది రైతులు సన్న బియ్యం వడ్లు పండించడం ద్వారా బోనస్ పొందారని వెల్లడించారు. 6,662 మంది చేయూత పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకము ద్వారా 401 స్వయం సహాయక సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా లబ్ధి పొందాయని, 831 మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. 10,119 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు, 1,072 మందికి కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం ద్వారా లబ్ధి పొందారని వెల్లడించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మహిళా సంఘాల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ భూపతి, ఎంపీఓ ప్రదీప్ కుమార్, వ్యవసాయ అధికారి దుర్గారాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అధిక ఉష్ణోగ్రతల నుండి జాగ్రత్తలు వహిస్తూ విధులు నిర్వర్తించాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 16 (వాయిస్ టుడే); అధిక ఉష్ణోగ్రతలను దృష్టి లో ఉంచుకొని జిల్లాలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న అధికారులకు,సిబ్బందికి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వడగలుల నుండి రక్షణకు కూలింగ్ గ్లాసెస్ అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తీవ్ర ఎండల సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్, వివిధ బందోబస్తు విధులలో పాల్గొనే వారు నీరు, గ్లూకోజ్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఎండల ప్రభావం తగ్గించే విధంగా తగిన రక్షణ చర్యలు తప్పని సరిగా పాటించాలని,తగిన జాగ్రత్తలతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం లో భాగంగ వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమలపై, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్ధాలపై, మైనర్ డ్రైవింగ్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

# సిబ్బంది సంక్షేమమే లక్ష్యం...

## నాగార్జునసాగర్‌లో టీజీ ఎస్ పి ఎఫ్ ఆర్థిక అవగాహన శిబిరం...



నాగార్జునసాగర్ ఏప్రిల్ 16 వాయిసు టుడే: సేవలో నిబద్ధతతో పాటు వ్యక్తిగత జీవితంలో స్థిరత్వం కూడా ముఖ్యమే అన్న దృక్పథంతో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం నాగార్జునసాగర్ యూనిట్ ముందడుగు వేసింది. సిబ్బంది సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కొనసాగుతున్న 99 రోజుల కార్యాచరణలో ఆర్థిక అవగాహన శిబిరాన్ని గురువారం ఆదర్శవంతంగా నిర్వహించింది. టీజీఎస్పీఎఫ్ గౌరవ డైరెక్టర్ జనరల్ ఆదేశాలు, జోన్ డీఐజీ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం నాగార్జునసాగర్ టీజీ జెన్‌కో పవర్ హౌస్‌లో సజావుగా జరిగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ టి. వెంకట గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ జి. నాగమల్లేశం నిపుణులుగా పాల్గొని సిబ్బందికి సమగ్ర మార్గదర్శకత్వం అందించారు.ఎన్ఎస్ డ్యామ్, టీజీ జెన్‌కోకు చెందిన టీజీఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది కలిపి మొత్తం 45 మంది ఈ శిబిరంలో పాల్గొని పొదుపు సంస్కృతి, సరైన పెట్టుబడుల ఎంపిక, అప్పుల నిర్వహణ, భవిష్యత్ ఆర్థిక ప్రణాళిక వంటి కీలక అంశాలపై లోతైన అవగాహన కల్పించారు. ముఖ్యంగా, సంపాదనకు సరైన దిశలో ప్రణాళిక ఉంటేనే ఆర్థిక భద్రత సాధ్యమవుతుందనే సందేశాన్ని స్పష్టంగా తెలియజేశారు.సిబ్బంది శ్రేయస్సే బలమైన వ్యవస్థకు పునాది అన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని అధికారులు తెలిపారు. ఈ తరహా శిబిరాలు సిబ్బందిలో ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడమే కాకుండా, వారి కుటుంబాల భవిష్యత్తుకు కూడా భరోసా కల్పిస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ కమాండెంట్ డి. విజయ భాస్కర్ రావు సమర్థవంతంగా పర్యవేక్షించారు.

## 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణ సభ కార్యక్రమం



వేములవాడ, ఏప్రిల్ 16 (వాయిస్ టుడే); వేములవాడ పట్టణం లో తేదీ 16-04-2026 రోజున 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం లో భాగం గా ఈ రోజు మహాలింగేశ్వర గార్డెన్ లో గౌరవ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ సమక్షం లో పట్టణ సభ కార్యక్రమము నిర్వహించడం జరిగింది .ఇందు లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి చర్చించడం జరిగింది.గౌరవ చైర్ పర్సన్ పుల్కం రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన పథకాలు 1) అల్పాహారం (ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు 2) ఇందిర కుటుంబ జీవిత బీమా పథకం (రాష్ట్రంలోని కుటుంభాలన్నిటికీ జీవిత బీమా) 3) మధ్యాహ్న భోజనం పథకం ఇంటర్మీడియట్ విద్య వరకు పొడిగింపు) 4) పంటల వైవిధ్యకరణ , ప్రకృతి సేంద్రీయ వ్యవసాయం పథకాల గురించి వారు తెలిపారు. మరియు ఇందిరమ్మ ఇండ్లు , కొత్త రేషన్ కార్డులు , పెన్షన్లు పేద ప్రజలకు చేరేలా కృషి చేస్తానని మరిన్ని కొత్త సంక్షేమ పథకాలు పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అని వారు తెలిపారు. గౌరవ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వములో 150 కోట్లతో శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానం అభివృద్ధి పనులు , 46 కోట్లతో ప్రధాన రోడ్డు విస్తరణ పనులు , 4.20 కోట్లతో రూపాయలతో పట్టణము లో రోడ్డు మరియు డ్రైనేజి పనులు మరియు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాము అని చెప్పడం జరిగినది.×జణూ ద్వారా పొన్నాల స్వామి గారికి వీల్ చైర్ ఇవ్వడం జరిగింది. మరియు అయ్యారు పల్లి, పార్వతి పురం అంగన్వాడీ కేంద్రాలో వాటర్ ప్యూరిఫైడ్ ఇవ్వడం జరిగినది.ఇట్టి కార్యక్రమం లో గౌరవ రెవెన్యూ డివిషన్ ఆఫీసర్ శ్రీమతి ఆర్.వి రాధా భాయ్ గారు ,వేములవాడ పట్టణ సిఐ గారు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ గారు, వార్డు కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటి సభ్యులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## నోయిడా కార్మికుల న్యాయ పోరాటానికి మా పూర్తి మద్దతు!

### సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఏప్రిల్-16 వాయిస్ టుడే : గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతూ సమ్మెపై నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సుల్తానాబాద్ కెనాల్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ దేశ రాజధాని సరిహద్దుల్లోని గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్ పారిశ్రామిక ప్రాంతంలో యాభై వేల మంది కార్మికులు గత ఐదు రోజులుగా తమ వేతనాలు పెంచాలని, పని భారం తగ్గించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, సెలవులు తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్నారు. రోజుకు పదమూడు గంటలు పని చేయించుకుంటూ నెలకు పది వేల నుండి పన్నెండు వేతనం మాత్రమే ఇస్తూ తీవ్రమైన శ్రమ దోపిడీకి ఉత్తర ప్రదేశ్, హర్యానా బిజెపి ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి.తమకు కనీస వేతనం ఇరవై ఆరు వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని, సమ్మె చేస్తున్న కార్మికులపై డబుల్ ఇంజన్ సర్కార్లు విరుచుకుపడి అణిచివేత చర్యలకు పూనుకున్నాయి కడుపు కాలి రోడ్డెక్కిన కార్మికులపై తప్పుడు ప్రచారానికి దిగుతున్నాయి, ఇప్పటికే నాలుగు వందల మంది కార్యకర్తలను అరెస్టు చేసి నిర్బంధించారన్నారు. ఇందులో అనేకమంది సిఐటియు నాయకులు మహిళా కార్మికులపై మగ పోలీసులు భౌతిక దాడులకు దిగుతున్నారు.ఈ దుర్మార్గమైన వైఖరిని ఉత్తరప్రదేశ్, హర్యానా బిజెపి ప్రభుత్వాలు మానుకోవాలని, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది. లేకుంటే రాబోయే రోజుల్లో నోయిడా కార్మికులు చేసే ప్రతి పోరాటానికి సిఐటియు అండగా నిలుస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సుల్తానాబాద్ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాజమల్లు, బండారి స్వామి, కల్లేపల్లి ప్రసాద్, వీరగోని కిరణ్, రాజమౌళి, శీను, ప్రశాంత్, సంపత్, శంకర్, సదయ్య, రవీందర్, ఎల్లయ్య, దుర్గయ్య, రమేష్, గణేష్, రాకేష్, విలాస్, అబ్బాస్, సుధాకర్ రావు, లక్ష్మణ్, కుమార్, మల్లేష్, యాకూబ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు..




## నాగార్జునసాగర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రెస్ క్లబ్ కార్యదర్శి
- దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,స్థానిక విలేకరులు

నాగార్జునసాగర్ ఏప్రిల్ 16 వాయిస్ టుడే: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జర్నలిస్టులకు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి తీపి కబురు అందించారు.గురువారం హైదరాబాద్‌లో జరిగిన టియుడబ్ల్యూజే ఐజేయు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి నల్గొండ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి,కార్యదర్శి కలిమెల నాగయ్య చైర్మన్‌ను కలిసి నాగార్జునసాగర్ విలేకరుల సమస్యలను వివరించారు.సాగర్ కేంద్రంగా పనిచేస్తున్న వివిధ పత్రికల విలేకరులకు అక్రిడిటేషన్ కార్డులు హో మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.వినతిపై సానుకూలంగా స్పందించిన శ్రీనివాసరెడ్డి నాగార్జునసాగర్ విలేకరులకు అక్రిడిటేషన్ సదుపాయం కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉంది.రాబోయే ఎగ్జిక్యూటివ్ సమావేశాల నాటికి నూటికి నూరు శాతం అర్హులైన విలేకరులందరికీ కార్డులు అందేలా కృషి చేస్తామని హామీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు,అంతర్జాతీయ గుర్తింపు ఉన్న నాగార్జునసాగర్ వంటి ప్రాంతంలో మీడియాకు అక్రిడిటేషన్ లభించడం వల్ల స్థానిక జర్నలిస్టులకు వృత్తిపరమైన గుర్తింపు లభిస్తుంది పర్యాటక అభివృద్ధి వార్తలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు,ప్రభుత్వం మరియు మీడియా అకాడమీ తీసుకుంటున్న ఈ నిర్ణయం పట్ల నల్గొండ జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,స్థానిక విలేకరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## హుగ్గేల్లి సిద్దుల గుట్టకు ఆధ్యాత్మిక వైభవం

- ఈనెల 27, 28, 29 తేదీల్లో మహోత్సవాలు
- గోడపత్రిక ఆవిష్కరించిన అవధూత గిరి మహారాజ్

వాయిస్ టుడే ఝరాసంగం ఏప్రిల్15 జహీరాబాద్ మండలం హుగ్గేల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సిద్దుల గుట్ట సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను గురువారం ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హుగ్గేల్లి గ్రామానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చేలా స్వామివారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, భక్తుల కోసం అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ ఋభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, హుగ్గేల్లి గ్రామ సర్పంచ్ పట్లోల విమల శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌బీ రాములు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎంజీ మానయ్య, పుట్టి అశోక్, హైదరాబాద్ కిష్టారెడ్డి, అలాగే వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం... మహిళా శక్తి భవనం భూమి పూజ



ఝరాసంగం. ఏప్రిల్ 16 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండల పరిధిలోని బొప్పన్‌పల్లి గ్రామంలో. అభివృద్ధి పనులకు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గురువారం సీసీ రోడ్డు పనులకు శ్రీకారం ప్రారంభించారు పాటు, మహిళా శక్తి భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొప్పనపల్లి సర్పంచ్ అమృత్, పంచాయతీ సెక్రటరీ అనిల్ పాటిల్, ఉప సర్పంచ్ రాములు, ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శంకర్ పాటిల్, కొల్లూర్ సర్పంచ్ శివరాజ్, నవీన్ పాటిల్, కంబాలపల్లి మాజీ ఎంపీటీసీ మారుతి పాటిల్, మాజీ సర్పంచ్‌లు సంగ్రామ్ పాటిల్, బాలయ్య, రామ్ రెడ్డి, మండల కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షకీల్, యువజన కాంగ్రెస్ నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సిరిసిల్లలోని కలెక్టరేట్ చౌరస్తాలో సీట్ బెల్ట్‌పై అవగాహన

### జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 16 (వాయిస్ టుడే) అరైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగం గా గౌరవ కలెక్టర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణం లోని కలెక్టరేట్ చౌరస్తా లో సీట్ బెల్ట్ పై జిల్లా రవాణా శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటారు వాహన తనిఖీ అధికారి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకొని వాహనాన్ని నడపాలని, లేనిచో ప్రమాదాలు జరిగినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావని, తద్వారా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా డ్రైవర్ తో పాటు ఇతర సీటులో కూర్చున్న ప్రయాణికులు కూడా తూచా తప్పకుండా సీట్ బెల్ట్ ను ధరించాలని ఎట్టి పరిస్తుతుల్లో మద్యం తాగి వాహనం నడపవద్దని తెలియజేశారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఉత్తమ పౌరులుగా ఉండాలని తెలియజేశారు. వాహన దారులు అందరితో రహదారి భద్రత ప్రతిజ్ఞను రవాణా శాఖ ఇన్స్పెక్టర్ చేయించారు. సీటు బెల్టు ధరించిన వాహనదారులకు ఔత్సాహికంగా వినూత్న పద్ధతిలో మిఠాయి లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సిరిసిల్ల సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి పృధ్వీరాజ్ వర్మా పోలీస్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, వాహన దారులు సుమారు 300 మంది వాహనదారులు పాల్గొన్నారు.




## ముకుందారెడ్డి కాలనీలో చలివేంద్రం ప్రారంభం




ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 16 (వాయిస్ టుడే ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ముకుందారెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, శబ్దం రెడ్డి, ఉపసర్పంచ్ అవేజ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటులో మహిళా బిల్లుకు మద్దతుగా బిజెపి ఆధ్వర్యంలో నారీ శక్తి వందన్ ర్యాలీ



సిరిసిల్ల, ఏప్రిల్ 16 (వాయిస్ టుడే); నారీ శక్తివందన్ అభియాన్ కార్యక్రమం లో భాగం గా పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ అమలు బిల్లుకు మద్దతుగా రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యం లో సంఘీభావ ర్యాలీ చేపట్టారు. సిరిసిల్ల పట్టణం లోని అంబేద్కర్ గారికి పూల మాల వేసి తదనంతరం నుండి బతుకమ్మ ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించి మహిళా బిల్లుకు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులు గా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కీర్తి రెడ్డి, బిజెపి మహిళా నాయకురాలు డాక్టర్ చెన్నమనేని దీప, బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి గారు హాజరయ్యారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ నారీ శక్తివందన్ అభియాన్ బిల్లు పార్లమెంటు లో ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కీర్తి రెడ్డి అన్నారు. సమాజం లో మహిళల పట్ల సమానత్వం ఉండేలా బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లు అమలుకు శ్రీకారం చుట్టడం మహిళలకు దక్కిన గౌరవ మన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లో దేశం లో మహిళలను ఉన్నత హోదా కల్పించారని స్పష్టం చేశారు. 60 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో ఉండి కూడా మహిళలకు గౌరవం దక్కలేదన్నారు. ఈ మహిళా బిల్లుతో డిలీమీటేషన్ ద్వారా చట్ట సభల్లో మహిళల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మహిళలు రాజకీయంగా ఎంతో ఎదుగు తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా,రాష్ట్ర మహిళా నాయకురాలు,వివిధ మండలాల మహిళా మోర్చా అధ్యక్షులు,మండల పదాధికారులు నూతనంగా ఎన్నికైనటువంటి ప్రజాప్రతి నిధులు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలు మెజారిటీ... అవకాశాలు మాత్రం మైనారిటీ

**బీసీ ఐక్యవేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మజ్జిగ బలరాం కురుమ**



బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, ఏప్రిల్ 16 : ఇటీవల విడుదలైన కుల గణన డేటా ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో బీసీలు సుమారు 56 శాతం జనాభా కలిగి ఉన్నారని స్పష్టమైంది. అయినప్పటికీ బీసీలకు రిజర్వేషన్లు, ఉద్యోగాలు, విద్య మరియు రాజకీయ ప్రాతినిధ్యం వంటి అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతోంది.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 27 నుండి 29 శాతం మాత్రమే రిజర్వేషన్ ఇవ్వడం సామాజిక న్యాయానికి విరుద్ధం. ఇది బీసీల హక్కులను నిరాకరించడం వంటిదే, ప్రభుత్వ ఉద్యోగాలల, ఉన్నత స్థాయి పదవుల్లో, విద్యా అవకాశాల్లో బీసీల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల బీసీలు మరింత వెనుకబడుతున్నారు.అందువల్ల బీసీ ఐక్య వేదిక, మేడ్చల్ జిల్లా తరఫున ప్రభుత్వాన్ని కింది డిమాండ్లు చేస్తున్నాము.

బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి

బీసీల కోసం ప్రత్యేక బడ్జెట్ (బీసీ సబ్ ప్లాన్ ) అమలు చేయాలి.

విద్యలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు హాస్టల్ సౌకర్యాలు కల్పించాలి.

ప్రైవేట్ సెక్టార్‌లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలి.

రాజకీయంగా బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.




## "దోస్త్ " 2026 పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం, ఏప్రిల్ 16, వాయిస్ టుడే : డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ "దోస్త్ "ద్వారా తొలిదశ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైనదని ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు.దోస్త్ ప్రవేశాల ప్రచార పోస్టర్ ని గురువారం ఆవిష్కరించారు.ఇంటర్ పాసైన విద్యార్థులు త్వరితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.మే 7వరకు రిజిస్ట్రేషన్స్, ఈనెల 30నుంచి మే 8వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టు కోవచ్చని తెలిపారు రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్ టికెట్ , ఆధార్ కార్డు, ఆధార్ కార్డు కు లింకైన ఫోన్ నెంబర్, టెన్త్, ఇంటర్ మెమోలు,6నుంచి 10వ తరగతి వరకు స్టడీ కండక్ట్ సర్టిఫికెట్ల జిరాక్సులు,ఇంటర్ టీ.సి, రెండు పాస్ పోర్ట్ ఫోటోలు కుల, ఇటీవల తీసుకున్న ఆదాయధ్రువీకరణ పత్రం వెంట తీసుకు రావాలని సూచించారు.ఇతర వివరాలకు తమ కళాశాల దోస్త్ సహయ కేంద్రంతో పాటు,9849841555,9618896949, నెంబర్ల లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, దోస్త్ కోఆర్డినేటర్ సలీం పాషా,ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ యాలాద్రి వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



## ముదిగొండ పోలీస్ సిబ్బంది పిల్లల ప్రతిభా పురస్కారం

**ఘనంగా సత్కరించిన సిఐ ఓ. మురళి**

ముదిగొండ మండలం ఏప్రిల్ 16 వాయిస్ టుడే : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే వారి తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం దక్కుతుందని ముదిగొండ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ) ఓ. మురళి పేర్కొన్నారు. ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పిల్లలు ఇటీవల వెల్లడైన ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన నేపథ్యంలో, గురువారం వారిని పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. 1.టి. సంతోష్ కుమార్:కానిస్టేబుల్ టి.వి. కిషోర్ కుమారుడు, ఇంటర్మీడియట్ (ఎంపీసీ)లో 992/1000 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు,2.బానోత్ హారిక: హోంగార్డు బానోత్ కిషన్ కుమార్తె, ఇంటర్మీడియట్ (ఎంపీసి)లో 980/1000 మార్కులతో ప్రతిభ చాటారు, 3. ముల్లగిరి ప్రహర్షిని: హోంగార్డు ముల్లగిరి కాంతారావు కుమార్తె, సీబీఎస్ఈ 10వ తరగతిలో 515/600 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా సిఐ మురళి విద్యార్థులను, వారి తండ్రులను ప్రత్యేకంగా పిలిపించి, ఎస్సై జి. హరిత మరియు పోలీసు సిబ్బంది సమక్షంలో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సీఐ మురళి మాట్లాడుతూ.. "నిరంతరం ప్రజా సేవలో ఉంటూ తీరికలేని విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది పిల్లలు ఇంతటి గొప్ప ఫలితాలు సాధించడం చాలా సంతోషకరం. విద్యార్థులు ఇదే పట్టుదలతో భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలను సాధించి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలి. తద్వారా మీ తల్లిదండ్రులకు, ఈ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు



హనుమకొండ, ఏప్రిల్ 16: తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ రాజ్యసభ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు నకరకంటి మోహన్ గౌడ్ హృదయపూర్వక అభినందనలు.. శు భాకాంక్షలు తెలియ జేశారు. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన వేం నరేందర్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంలో, తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని మోహన్ గౌడ్ ఆకాంక్షించారు.

# జడ్చర్లలో రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన సందస్సు

**జడ్చర్లలో రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన సందస్సు**



జడ్చర్ల, ఏప్రిల్ 16 వాయిస్ టుడే (ప్రతినిధి): జడ్చర్ల పట్టణానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, హెల్మెట్లు, మెడికల్ కిట్లు, డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీతో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన సందస్సు నిర్వహించారు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీతో పాటు రోడ్డు భద్రతా చర్యలకు ప్రజల విశేష స్పందన జిల్లా ఎస్పీ డి.జానికి, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యచరణలో గురువారం తెలంగాణ రాష్ట్ర బి.శివధర్ రెడ్డి, , డీజీపీ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన "అరైవ్ ఆరైవ్ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా మొదటగా బాలానగర్ మండలం పెద్దాయపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి--44 కూడలిలో బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన ప్రదేశంలో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం డీజీపీ చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనంపల్లి అనిరుద్ రెడ్డి తరపున నిర్వహించారు.

అనంతరం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను డీజీపీ సందర్శించి గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. తదుపరి జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో సుమారు 3000 మంది విద్యార్థులు, డ్రైవర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు. మొదటగా జడ్చర్ల మెడికల్ అసోసియేషన్ తరపున పంపిణీ చేసిన మెడికల్ కిట్లను ఆటో డ్రైవర్లకు డీజీపీ బి.శివధర్ రెడ్డి, చేతుల మీదుగా అందించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స అందించేందుకు ఈ మెడికల్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి ప్రాణాలను కాపాడే బాధ్యతతో వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు. హెటెరో ల్యాబ్స్ (జడ్చర్ల) డైరెక్టర్ ఫార్ములేషన్స్ డా.పి.ఆర్.భాస్కర్ రెడ్డి తమ సి ఎస్ ఆర్ నిధుల నుండి 500 టీ-షర్టులను మరియు 100 హెల్మెట్లను సామాజిక సేవలో భాగంగా విరాళంగా అంధించి, హెటెరో సంస్థ ప్రతినిధి మరియు అడ్మిన్ హెడ్ అయిన డి.ఫణి రాజ కిరణ్ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ని డీజీపీ సందర్శించి, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ, హెల్మెట్ల పంపిణీ మరియు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించారు.



కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ డి.జానకి, స్వాగత ఉపన్యాసం అందిస్తూ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యతగా తీసుకొని ట్రాఫిక్ రూల్స్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గత ఏడాది జనవరి నుండి ఏప్రిల్ మధ్య జరిగిన యాక్సిడెంట్లతో పోల్చుకుంటే 2026 జనవరి నుండి ఏప్రిల్ వరకు 20% యాక్సిడెంట్లు తగ్గాయి అని, ప్రజలు రోడ్డు నియమాలను తప్పనిసరిగా అనునిత్యం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటూ, ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఒక చిన్నారి విద్యార్థి రోడ్డు భద్రతపై ప్రసంగించడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఐఏఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు. తదుపరి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ప్రజాప్రతితులు పాల్గొన్నారు.

## మీడియా అంశంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం

**- ప్రతి జర్నలిస్టుకు లీగల్ శిక్షణ అవసరం**

**- ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు టి. ఎస్ . చక్రవర్తి**



ఖమ్మం, ఏప్రిల్ 16( వాయిస్ టుడే): ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాసిన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేయడం హర్షణీయమని ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షులు టి సంతోష్ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయడానికి చేసే ప్రతి ప్రయత్నం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఇటువంటి చర్యలపై ప్రభుత్వాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ రుషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్ .వి. ఎన్ భట్టి ల ధర్మాసనం విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమని స్పష్టం చేసింది. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత జర్నలిస్టును అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణను మంజూరు చేస్తూ, అభిప్రాయాలను అణిచి వేయడం సరైన విధానం కాదని తేల్చిచెప్పిందన్నారు..భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం అభిప్రాయ స్వేచ్ఛ ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని సుప్రీంకోర్టు మరోసారి గుర్తు చేసిందన్నారు. స్వేచ్ఛా మాధ్యమాలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, విమర్శలు పాలనలో లోపాలను సరిదిద్దే శక్తిగా పనిచేస్తాయని పేర్కొందన్నారు. "విమర్శ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. జర్నలిస్టులపై కేసులతో ఒత్తిడి తెచ్చే చర్యలు అత్యంత ప్రమాదకరం" అని ఆయన అన్నారు. జర్నలిస్టులకు లీగల్ అవగాహన పెంపు అత్యవసరమని, ప్రతి నెల చట్టపరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే మీడియా రంగం మరింత బలోపేతం అవుతుందని చక్రవర్తి సూచించారు.

## ప్రజా పాలన.. ఇదే స్ఫూర్తితో కొనసాగించాలి : జిల్లా కలెక్టర్



జూలూరుపాడు: 'ప్రజా పాలన... ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ఇకముందు కూడా ఇదే స్ఫూర్తితో కొనసాగించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు ప్రజాప్రతినిధులకు సూచించారు. గురువారం జూలూరుపాడు రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయాల బయటకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే ఏమి సాధించాలో అవగతమవుతుందన్నారు. అధికారులు గ్రామపంచాయతీ సర్పంచులు సమన్వయంతో అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం 45 రోజులు పూర్తయిందని, మిగిలిన కార్యక్రమాన్ని సైతం అన్ని శాఖల సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర పథకాల, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామస్థాయిలో పనులు నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోడల్ గ్రామపంచాయతీలకు అవార్డులు ప్రకటిస్తున్నాయని.. ఆ దిశగా సర్పంచులు ఆలోచన చేయాలన్నారు. వేసవిలో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని అన్ని పంచాయతీల్లోనూ కార్యాలయాల్లోనూ చలివేంద్రాల ద్వారా ప్రజలకు తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. జీవితం ఎంతో విలువైందని, వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారి నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం ఉత్తమం అన్నారు. పంటల వివరాల నమోదులో ఏఈవోలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆయన జూలూరుపాడు సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, యంత్రాలు, సెంటర్ ఇన్‌ఛార్జీల నియామకం తదితర విషయాలను సొసైటీ కార్యదర్శి తెలంగాణ నరసింహారావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవి, ఎంపీఓ తులసీరామ్, ఎస్ఐ రవి పాల్గొన్నారు.

# గంజాయి రహిత సమాజం కోసం గ్రామాల నుండే మార్పు మొదలవ్వాలి

## ముదిగొండ సిఐ వడ్డేపల్లి మురళీ

ముదిగొండ మండలం ఏప్రిల్ 16 వాయిస్ టుడే: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను, నడవడికను నిరంతరం గమనిస్తూ ఉండాలని, యువత పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కుటుంబంపై ఉందని ముదిగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) వడ్డేపల్లి మురళీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నవతేజ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన '99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలు' మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



**అవగాహనతోనే మార్పు సాధ్యం:**

గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సిఐ సూచించారు. "మార్పు మీ గ్రామాల నుండే మొదలవ్వాలి. గంజాయి, రోడ్డు ప్రమాదాల నివారణపై గ్రామాల్లో నెలకు ఒకసారైనా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి. దీనికోసం పోలీసు శాఖ నుండి పూర్తి సహకారం అందిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.

**సమాచారం అందించండి:**

గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసినా లేదా ఎవరైనా సేవిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అక్రమ కార్యకలాపాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు.

**హెల్మెట్ ధరించడం బాధ్యత:**

రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి ఇంటి నుండి బయటకు వచ్చే వ్యక్తి ఖచ్చితంగా హెల్మెట్ ధరించేలా కుటుంబ సభ్యులు చూడాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, పోలీసు శాఖకు సహకరిస్తున్న ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**